సాక్షి
అనంతపురం
సోమవారం । 11 । మార్చి । 2024



టమాట కిలో రూ.12

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.12 పలికింది. కనిష్టం రూ.4, సరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



కల్యాణం.. భక్తజన పరవశం

దక్షిణ కాశీ క్షేత్రంగా ఖ్యాతిగాంచిన తాడిపత్రిలో స్వామివారి కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. 8లో

గరిష్టం/కనిష్టం
39.6°/21.3°

జిల్లాలో ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం కొనసాగింది. తూర్పు దిశగా గాలులు గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష



పరీక్ష కేంద్రం తనిఖీ చేస్తున్న గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయ అధికారి మురళీకృష్ణ

అనంతపురం ఎడ్యుకేషన్: డాక్టర్ బీఆర్ అంబే డ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆదివారం నిర్వహించిన రాత పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 5వ తరగతి ప్రవేశ పరీక్షకు 16 కేంద్రాలు ఏర్పాటు చేశారు. 480 సీట్లకు గాను 10,234 మంది దరఖాస్తు చేసుకోగా, 9,395 మంది హాజరయ్యారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షకు 1,200 సీట్లకు గాను 5,596 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 4,785 మంది హాజరయ్యారని అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల ఉమ్మడి జిల్లా సమన్వయ అధికారి మురళీకృష్ణ తెలిపారు.

రౌడీషీటర్లపై నిఘా



అనంతపురం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ రెడ్డప్ప

అనంతపురం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రౌడీషీటర్ల కదలికలపై పోలీసు నిఘా పెరిగింది. ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు ఆదివారం జిల్లాలో రౌడీ షీటర్లను పోలీసుస్టేషన్లకు పిలిపించి కౌన్సెలింగ్ చేపట్టారు. రౌడీషీటర్ల నేర చరిత్ర, ప్రస్తుత జీవన విధానం, స్థితిగతులపై ఆరా తీశారు. పాత పంథా పునరావృతమైతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. బుద్ధిగా జీవించాలని సూచించారు. జిల్లాలో ఎక్కడైనా రౌడీ షీటర్లు ఆగడాలు హెచ్చుమీరినా, దౌర్జన్యాలు చేస్తున్నా, పాత పంథా కొనసాగిస్తున్నా తన ఫోన్ నెంబర్ 9440796800కు సమాచారం పంపాలని ఎస్పీ కోరారు. సమాచారం పంపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

13న ప్రధాని ముఖాముఖి కార్యక్రమం


అనంతపురం రూరల్: ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ, ఎన్‌బీసీఎఫ్‌డీసీ ఆర్థిక సంస్థల నుంచి ఎస్సీ, బీసీ కార్పొరేషన్ తరఫున రుణాలు పొందిన లబ్ధిదారులతో ఈ నెల 13న సాయంత్రం 4 గంటలకు వర్చువల్ విధానంలో ప్రధాని నరేంద్ర మోదీ ముఖాముఖి కార్యక్రమం ఉంటుంది. ఈ మేరకు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సారయ్య ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. కలెక్టర్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి జిల్లాలోని ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు హాజరుకావాలని కోరారు.

ఏం జేసినా అభాసుపాలే!

'నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు' అన్నట్లుంది జేసీ ప్రభాకర్‌రెడ్డి తీరు. అధికారమే అండగా ఒకప్పుడు తాడిపత్రి నియోజకవర్గంలో కక్షలు, కార్పణ్యాలు రాజేసిన ఆయన నేడు తనను తాను శాంతికాముకుడిలా బిల్డప్ ఇస్తుండడంపై జనం నవ్వుకుంటున్నారు. ఒళ్లంతా విషం నింపుకుని ఒంటిపై శాలువ, నుదుటిపై విబూది పెట్టినంత మాత్రాన అరాచకాలు మరచిపోగలమా అంటూ ప్రశ్నిస్తున్నారు.

విషం దా'జేసీ'.. వేషం కట్టేసి!

- తాడిపత్రిలో అలజడి రేపేందుకు జేసీ ప్రభాకర్ రెడ్డి కుట్రలు
- ఒళ్లంతా విషం నింపుకుని 'శాంతి కాముకుడి'లా బిల్డప్
- ఎన్ని వేషాలేసినా నమ్మబోమంటున్న ప్రజలు
- గతంలో కక్షలు రాజేసి పబ్బం గడుపుకోలేదా అంటూ విమర్శలు



తాడిపత్రిరూరల్: 'శంఖారావం' సభలో పాల్గొనేందుకు సోమవారం టీడీపీ నేత నారా లోకేష్ తాడిపత్రి వస్తున్నారు. ఈ క్రమంలో ఆయన కంట్లో పడేందుకు జేసీ చేస్తున్న డ్రామా అందరికీ నవ్వులు తెప్పిస్తోంది. పట్టణ పోలీసు స్టేషన్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన జేసీ ప్రభాకర్ రెడ్డి ఫ్లెక్సీ అందరినీ పగలబడి నవ్వేలా చేస్తోంది. 'దొంగే దొంగ.. దొంగ' అన్న చందంగా ఉందని ఫ్లెక్సీని చూసి పలువురు విమర్శలు గుప్పించారు. దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా అందులోని అక్షరాలు ఉన్నాయని మండిపడ్డారు.

అరాచకాలు మరువగలమా జేసీ..!

అధికారంలో ఉన్నప్పుడు జేసీ ప్రభాకర్ రెడ్డి చేసిన అరాచకాలు అన్నీ ఇన్నీ కావు. ప్రశాంతంగా ఉన్న గ్రామాలను తన ప్రాపకం కోసం రెండుగా చీల్చారు. కక్షలు, కార్పణ్యాలు రాజేశారు. తాడిపత్రి మండలం వీరాపురం గ్రామంలో జేసీ ప్రభాకర్ రెడ్డి రాజేసిన చిచ్చు ఇప్పటికీ చల్లారడం లేదంటే అతిశయోక్తి కాదు. తన రాజకీయ లబ్ధి కోసం ప్రశాంతంగా జీవనం సాగిస్తున్న గ్రామస్తులను రెచ్చ గొట్టి రెండు వర్గాలుగా చీలగొట్టారు. నిప్పు రాజేసి తమకు కావాల్సిన సమయంలో ఆజ్యం పోశారు. వీరి వికృత చేష్టలు గత ఎన్నికల సమయంలో ఏకంగా భాస్కర్‌రెడ్డి అనే వ్యక్తి హత్యకు దారి తీశాయి. ప్రశాంతంగా ఉన్న ఇగుడూరు గ్రామంలో సైతం జేసీ ప్రభాకర్ రెడ్డి గతంలో వర్గ కక్షలకు తెర లేపారు. ప్రతిపక్ష పార్టీ నాయకుల పొలాల్లో చెట్లు పీకేయించడం, బోర్లు పగుల గొట్టడం తదితర చర్యలకు ఉసిగొల్పి రాక్షసానందం పొందారు.

- అధికార దాహంతో కన్నూమిన్నూ కానరాకుండా వ్యవహరించిన జేసీ ప్రభాకర్ రెడ్డి గతంలో ఎమ్మెల్యే పెద్దారెడ్డి స్వగ్రామంలో చిచ్చు రాజేయాలని చూశారు. పెద్దారెడ్డి రాజకీయంగా ఎదుగుతుండడం చూసి ఎలాగైనా దెబ్బగొట్టేందుకు ఆయన స్వగ్రామం తిమ్మంపల్లివాసులను రెండు వర్గాలుగా విడగొట్టారు. గ్రామంలో తన అనుచరునికి ఇల్లు కొనుగోలు చేయించి కక్షలు రాజేశారు. పెద్దారెడ్డిపై అక్రమ కేసులు బనాయించారు. అంతటితో ఆగక 'నేను నీ ఊరొచ్చా, ధైర్యం ఉంటే నీవు తాడిపత్రికి రావాలంటూ' పెద్దారెడ్డిని రెచ్చగొట్టారు. జేసీ చాలెంజ్‌ను స్వీకరించిన పెద్దారెడ్డి ఆయన కోరినట్లుగానే తాడిపత్రికి వచ్చారు. అప్పటికే జేసీ సోదరుల ఆగడాలతో విసిగిపోయిన ప్రజలు పెద్దారెడ్డికి జై కొట్టారు. ఎన్నికల్లో జేసీ తనయుడిని చిత్తుచిత్తుగా ఓడించారు. అయినా, జేసీ ప్రభాకర్ రెడ్డికి బుద్ధి మాత్రం రాలేదు. ఎమ్మెల్యే పెద్దారెడ్డి మంచితనాన్ని ఆసరాగా చేసుకుని ఇప్పటికీ నియోజకవర్గవ్యాప్తంగా దౌర్జన్యాలు చేస్తున్నారు. తన అనుచరులను రెచ్చగొడుతూ ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో మళ్లీ అలజడులు రేకెత్తిస్తున్నారు. తాజాగా వైఎస్సార్ సీపీ నాయకులను కవ్వించేందుకు తానేదో మంచికి మారు పేరు అన్నట్లుగా ఫ్లెక్సీలు కట్టించుకున్నారు. గతంలో ఆయన చేసిన అరాచకాలను చూసిన ప్రజలు ఇదంతా చూసి నవ్వుకుంటున్నారు. ఇతనికెప్పటికి బుద్ధి వస్తుందో అంటూ నిట్టూరుస్తున్నారు.

కేజీబీవీల్లో ప్రవేశాలకు దరఖాస్తులు



అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నడుస్తున్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) 2024–25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. 6, 11వ తరగతుల్లో ప్రవేశానికి, 7,8,9 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఈనెల 12 నుంచి ఏప్రిల్ 11 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని డీఈఓ వరలక్ష్మీ, సమగ్ర శిక్ష ఏపీసీ వరప్రసాదరావు ఓ ప్రకటనలో తెలిపారు. అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్ (బడి మానేసిన పిల్లలు) నిరుపేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. https://apkgbv.apcfss.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ ద్వారా సమాచారం అందుతుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఆర్టీఈ టోల్‌ఫ్రీ నంబరు 18004258599కు కాల్ చేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భవిష్యత్తుకు భరోసా

మహిళల అభ్యున్నతికి జగన్ సర్కార్ పెద్దపీట వేస్తోంది. వారు ఆర్థికంగా అభివృద్ధి సాధించే లక్ష్యంగా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోంది. స్వయం ఉపాధి ద్వారా జీవన ప్రమాణాలు మెరుగుపర్చుకునేందుకూ ఆర్థిక చేయూత అందిస్తోంది. ఇవన్నీ ఒక ఎత్తయితే అక్కచెల్లెమ్మలకు స్థిరాస్తి సమకూరుస్తూ భవిష్యత్తుకు భరోసా కల్పిస్తోంది.



స్థల రిజిస్ట్రేషన్ పత్రాలతో లబ్ధిదారులు (ఫైల్)

- శరవేగంగా ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్లు
- అనతి కాలంలోనే 50 వేలకు పైగా పూర్తి
- పత్రాలు అందుకుని మురిసిపోతున్న అక్కచెల్లెమ్మలు

అనంతపురం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన మహిళలకు జగనన్న కాలనీల్లో ఇంటి స్థలం కేటాయించడంతో పాటు పక్కా గృహం మంజూరు చేసింది. అంతటితో ఆగకుండా ఇప్పుడు ఆ ఇంటి స్థలాన్ని వారి పేరున రిజిస్ట్రేషన్ చేసి సంపూర్ణ హక్కు కల్పిస్తోంది. జిల్లావ్యాప్తంగా అన్ని సచివాలయాల్లో ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ యజ్ఞంలా సాగుతోంది. నెల వ్యవధిలో 87.81 శాతం రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి.

నిరాటంకంగా ప్రక్రియ..

జిల్లావ్యాప్తంగా అనంతపురం నగరం, తాడిపత్రి, కళ్యాణదుర్గం, గుత్తి, గుంతకల్, రాయదుర్గంతో పాటు 31 మండలాల పరిధిలోని సచివాలయాల్లో ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిరాటంకంగా సాగుతోంది. స్థలం రిజిస్ట్రేషన్ కోసం 57,391 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ఇప్పటి వరకు 50,458 రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. మిగిలిన స్థలాల రిజిస్ట్రేషన్ రెండు మూడు రోజుల్లో పూర్తి అవుతుందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

రిజిస్ట్రేషన్ వివరాలిలా..	
మండలాలు	31
స్థల రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తులు	57,391
రిజిస్ట్రేషన్ పూర్తయ్యింది	50,458
రిజిస్ట్రేషన్ చేయాల్సింది	7,473

చాలా ఆనందంగా ఉంది



ప్రభుత్వం మాకు ఇంటి స్థలం ఇవ్వడమే కాకుండా, ఆ స్థలాన్ని నా పేరున రిజిస్ట్రేషన్ చేయడం చాలా ఆనందంగా ఉంది. పేదల సొంతింటి కలను ప్రభుత్వం నెరవేర్చింది. అంతే కాకుండా స్థలంపై సంపూర్ణ హక్కును కల్పించడం గొప్ప విషయం. పేదల మంచి కోసం ఇంత చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– రాయమ్మ, ఆత్మకూరు

స్థిరాస్తిని సమకూర్చారు



గత ప్రభుత్వంలో ఇంటి స్థలం కోసం ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా రాలేదు. ఈ ప్రభుత్వంలో మా కల నెరవేరింది. మేము ఎక్కడికీ తిరగాల్సి అవసరం రాలేదు. వలంటీరు మా ఇంటికే వచ్చి వివరాలు తీసుకుని వెళ్లాడు. ప్రభుత్వం మాకు ఇంటి స్థలం ఇవ్వడమే కాకుండా నా పేరున రిజిస్ట్రేషన్ చేసి స్థిరాస్తిని సమకూర్చింది. మాలాంటి వారికి బాగుకోసం పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

– లక్ష్మి, ఆత్మకూరు

వేగవంతంగా రిజిస్ట్రేషన్



పేదలకు ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ జిల్లాలో వేగవంతం చేశాం. నెల రోజుల వ్యవధిలో 87 శాతం రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. రిజిస్ట్రేషన్ కోసం 57 వేలు దరఖాస్తులు రాగా 50 వేలు పూర్తయ్యాయి.

– ఎం.గౌతమి, కలెక్టర్

వైభవం.. వీరభద్రస్వామి రథోత్సవం





ప్రత్యేక అలంకరణలో వీరభద్ర స్వామి, రథోత్సవంలో పాల్గొన్న అశేష భక్తజనం

వజ్రకరూరు: మండల పరిధిలోని తట్రకల్లు గ్రామంలో ఆదివారం భద్రకాళిసమేత వీరభద్ర స్వామి రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. ఉదయం ఆలయంలో స్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు,రుద్రాభిషేకం చేశారు. మధ్యాహ్నం కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా చేపట్టారు. సాయంత్రం ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చి రథంపై కొలువుదీర్చి ఉత్సవం ప్రారంభించారు. వేలాది మంది భక్తులు రథోత్సవంలో పాల్గొన్నారు. నమో వీరభద్ర, హరహర మహాదేవ నామస్మరణతో మార్మోగించారు. వేడుకలను పురస్కరించుకుని ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. కార్యక్రమంలో సర్పంచు మూరిన్ని ధనలక్ష్మి, ఎంపీటీసీ రామక్రిష్ణ, ఆలయ అర్చకులు రాఘవేంద్రస్వామి, గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అగ్నిగుండ మహోత్సవం

హేమవతి(అమరాపురం): హేమావతి సిద్ధేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అగ్నిగుండ మహోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం 8 గంటలకు ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా పూలతో అలంకరించి మంగళ వాయిద్యాల నడుమ ఆలయ ఆవరణలో కుడివైపున ఉన్న అగ్నిగుండం వద్దకు తీసుకొచ్చి పూజలు చేశారు. అర్చకులతో పాటు ఆలయ కమిటీ చైర్మన్ మంజునాథ, ఈఓ నరసింహ మూర్తి, కమిటీ సభ్యులు, ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి తదితరులు ధూపం వేసి అగ్నిగుండ మహోత్సవాన్ని ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వేరుశనగ, చింతపండు, కందులు, నవధాన్యాలను అగ్నిగుండంలో వేశారు.



అగ్నిగుండంలోకి ధూపం వేస్తున్న భక్తులు

గిరిజనుల గుండెల్లో జగన్



మంత్రి ఉషశ్రీ, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డితో కలిసి అభివాదం చేస్తున్న గిరిజన సంఘం ప్రతినిధులు

పుట్టపర్తి రూరల్: తమ జాతికి మేలు చేసిన సీఎం జగన్‌కే తమ మద్దతు అని గిరిజనం నినదించింది. రాజకీయ, నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పించి గుండెల్లో కొలువయ్యారని కీర్తించింది. తమ జీవితాలు మరింత బాగుపడాలంటే వైఎస్సార్‌సీపీని గెలిపించుకుని జగన్‌ను మరో మారు ముఖ్యమంత్రి చేసుకుంటామని ప్రతిన బూనింది. శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలో వైఎస్సార్‌సీపీ గిరిజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ దుంగావత్ రమేష్ నాయక్ ఆధ్వర్యంలో ఆదివారం 'గిరిజన జన గర్జన' సభ నిర్వహించారు. ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు తిరుపాల్ నాయక్ ఎస్టీలకు జగనన్న ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. గోరంట్ల జెడ్పీటీసీ పాలే జయరాం నాయక్, పెడపల్లి శ్రీరామ్ నాయక్ ఉత్తేజ పరిచే ప్రసంగం చేశారు.

అర్జునుడు జగన్

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభిమన్యుడు కాదని.. అర్జునుడని మంత్రి ఉషశ్రీచరణ్ అభివర్ణించారు. ఎన్ని పార్టీలు పొత్తులతో వచ్చినా విజయం సాధిస్తారని స్పష్టం చేశారు. గిరిజన గర్జన సభలో ముఖ్య అతిథిగా మంత్రి మాట్లాడారు. చంద్రబాబుకు విలువలు లేవన్నారు. ప్రధాని మోదీని దేశద్రోహి అని తిట్టిన ఆయనే.. పొత్తు కోసం కాళ్ల బేరం చేసుకున్నాడని విమర్శించారు. గిరిజనులకు దేశంలో ఏ నాయకుడూ చేయని విధంగా జగన్ మేలు చేశారన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలిలో మొదటిసారిగా గిరిజనులకు స్థానం కల్పించారన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, గృహ నిర్మాణం అన్ని రంగాల్లోనూ ఎస్టీలకు మేలు చేకూర్చారన్నారు. అన్ని పథకాల్లోనూ మహిళలకు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ఎస్టీలకు ఒక కొమరం భీమ్‌లా సీఎం జగన్ నిలిచారన్నారు. అటువంటి మంచి నాయకునికి మరొక్కసారి గిరిజనులు మద్దతు తెలిపి వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తేవాలని కోరారు. 500 జనాభా కలిగిన గిరిజన తండాలను గ్రామపంచాయతీలుగా గుర్తించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. జగనన్నతోనే బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరుగుతోందని హిందూపురం పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బోయ శాంతమ్మ అన్నారు. కార్యక్రమంలో కదిరి నియోజకవర్గ సమన్వయకర్త మక్బూల్ అహ్మద్, టీటీడీ బోర్డు మెంబర్ అశ్వత్థనాయక్, పార్టీ నాయకులు వజ్ర భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మించిన పాలకుడు లేడు

- పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా
- మహిళా పాడి రైతులకు 'అమ్మ డెయిరీ' గిఫ్ట్ డీడ్‌ల అందజేత





మహిళలకు గిఫ్ట్ డీడ్‌లు అందజేస్తున్న మంత్రి రోజా, చిత్రంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, బోయ శాంతమ్మ, గిరిజమ్మ తదితరులు, హాజరైన మహిళలు

రాప్తాడురూరల్: ''రాష్ట్రంలో జగనన్నను మించిన పాలకుడు లేడు. ఆయనను మించిన పోరాట యోధుడు, మనసున్న మారాజు లేడు. ఆంధ్రప్రదేశ్ గడ్డ రాజశేఖర రెడ్డి బిడ్డ జగన్ అడ్డా'' అని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. అనంతపురం రూరల్ మండలం ఆలమూరు జగనన్న కాలనీ వద్ద ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన 'అమ్మ డెయిరీ'కి సంబంధించి గిఫ్ట్ డీడ్‌లను ఆదివారం మంత్రి రోజా చేతుల మీదుగా మహిళా పాడి రైతులకు అందజేశారు. ముందుగా మంత్రి డెయిరీని పరిశీలించారు. అనంతరం డెయిరీ ఆవరణలో ఏర్పాటు చేసిన 'వైఎస్సార్ చేయూత' కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ మహిళల మోముల్లో చిరునవ్వు చూసేందుకు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి రూ. 20 కోట్లు ఖర్చు చేసి పాల డెయిరీ ఏర్పాటు చేయడం సంతోషదాయమన్నారు. రాప్తాడు ప్రజల కోసం ప్రకాష్ రెడ్డి ఎన్నో కష్టనష్టాలు భరించారన్నారు. ఎన్నికల వరకు కనిపించని టీడీపీ, జనసేన నాయకులు ఇప్పుడు రెండు జెండాలు పట్టుకుని తిరుగుతున్నారని విమర్శించారు. దొంగలంతా కలిసి ఊర్లమీద పడ్డారని మండిపడ్డారు. 'మా అన్న 'తోపు'.. మీకు వీలైతే ఆపు' అంటూ పరిటాల ఫ్యామిలీకి సవాల్ చేశారు. రాప్తాడు గడ్డ తోపుదుర్తి బిడ్డ ప్రకాష్‌రెడ్డి అడ్డా అన్నారు.

చంద్రబాబును తరిమికొట్టేందుకు సిద్ధం

వైఎస్సార్ ఆసరా కింద డ్వాక్రా మహిళలకు నాలుగు విడతల్లో రూ. 25,570 కోట్లు జమ చేశారని మంత్రి రోజా పేర్కొన్నారు. వైఎస్సార్ చేయూత కింద రూ. 19,500 కోట్లు, పింఛన్ల కింద రూ.86 వేల కోట్లు అందించారన్నారు. 'జగనన్నను మళ్లీ సీఎం చేయడానికి మేం సిద్ధం,మీరు సిద్ధమా', 'మహిళలను ఏమార్చే చంద్రబాబుకు చుక్కలు చూపించడానికి మేం సిద్ధం, మీరు సిద్ధమా?', 'మహిళలంటే గౌరవం లేని పవన్ కళ్యాణ్‌ను తరిమికొట్టడానికి మేం సిద్ధం, మీరు సిద్ధమా?' అని ప్రశ్నించగా, మహిళలు ముక్తకంఠంతో 'సిద్ధం' అని బదులిచ్చారు. జగనన్న ప్రజల కోసం ఎలా బటన్ నొక్కారో...? పోలింగ్ రోజున మీరు ఫ్యాను గుర్తుపై నొక్కాలని కోరారు.

ప్రజా సంక్షేమం కోసం శాయశక్తులా కృషి చేశా..

ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆశీస్సులతో 2019 ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఎక్కడా అవినీతి, అక్రమాలకు తావు లేకుండా జనం సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా శాయ శక్తులా కృషి చేశానన్నారు. 17 వేల ఇళ్లను మంజూరు చేయించానన్నారు. ఒక్కసారి ఫ్యాను గుర్తుకు ఓటు వేసినందుకు 2 వేలమంది పేద రైతులకు ఉచితంగా బోర్లు వేయించినట్లు తెలిపారు. 4 వేలమంది మహిళలకు ఉపాధి కోసం గార్మెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు 11.50 ఎకరాల భూములు కేటాయించామన్నారు. 30 వేల మందికి ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మహిళా పాడి రైతుల కోసం రూ. 20 కోట్ల సొంత డబ్బు ఖర్చు చేసి అమ్మ డెయిరీ ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గ ప్రజల చిరకాల వాంఛ అయిన పేరూరు డ్యాంకు నీళ్లు తెచ్చుకున్నామని, త్వరలో బంగారు గనులను తెరిపిస్తున్నామన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మాట్లాడుతూ నియోజకవర్గంలోని మహిళా పాడి రైతుల కోసం డెయిరీని అంకితం చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యమంత్రిని ఆదర్శంగా తీసుకుని ప్రకాష్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతున్నారన్నారు. కార్యక్రమంలో హిందూపురం పార్లమెంట్ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త శాంతమ్మ, పార్టీ సీనియర్ నాయకులు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ వరలక్ష్మీ, జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ధనుంజయ యాదవ్, పార్టీ మండల కన్వీనర్లు కె.రాధమ్మ, దుగుమర్రి గోవిందరెడ్డి, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, నాయకులు పవన్, వడ్డే శీనా, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అంతర్జాతీయ టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలకు ఎంపిక


రాజశేఖర్

గార్లదిన్నె: మండలంలోని కల్లూరు ఆర్ఎస్ గ్రామానికి చెందిన పుల్లన్న, అచ్చెమ్మ దంపతుల కుమారుడు రాజశేఖర్... అంతర్జాతీయ టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారు. బీపీఈడీ పూర్తి చేసిన ఆయన ఓ ప్రైవేట్ పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేశారు. ప్రస్తుతం శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం పాలసముద్రంలో కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్ – ఇన్‌డైరెక్ట్ టాక్స్ అండ్ నార్కోటిక్స్ (నాసిన్)లో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ఈ ఏడాది జనవరిలో ఒంగోలులో జరిగిన రాష్ట్ర స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీల్లో జిల్లా జట్టు తరఫున ప్రాతినిథ్యం వహించిన ఆయన ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టుకు ఎంపికయ్యారు. గత నెల 2 నుంచి 5వ తేదీ వరకూ తమిళనాడులోని రామనాథపురంలో జాతీయ స్థాయి పోటీలు జరిగాయి. ఈ పోటీల్లోనూ రాణించిన రాజశేఖర్ మే 2, 3 తేదీల్లో థాయిలాండ్‌లో జరిగే అంతర్జాతీయ పోటీల్లో భారతదేశం తరఫున ప్రాతినిథ్యం వహించనున్నారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులతో పాటు టెన్నిస్‌బాల్ క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ రాజశేఖర్‌ను అభినందించారు.

హ్యాండ్‌బాల్ చాంపియన్ 'అనంత'



విజేత ట్రోఫీని అందుకుంటున్న అనంతపురం జట్టు

కర్నూలు (టౌన్): రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పురుషుల చాంపియన్‌షిప్‌ను అనంతపురం జట్టు దక్కించుకుంది. పశ్చిమగోదావరి జిల్లా రన్నర్‌గా నిలవగా.. కర్నూలు జట్టు మూడో స్థానంతో సరిపెట్టుకుంది. కర్నూలు నగర శివారులో 52వ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పురుషుల చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. విజేతలకు ట్రోఫీలను గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ అందజేశారు. రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు, వివిధ జిల్లాల క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కల్యాణం.. భక్తజన పరవశం


పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ధర్మకర్తల మండలి చైర్మన్ మురళీప్రసాద్‌రెడ్డి

- వైభవంగా బుగ్గ రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవం
- నేత్రపర్వంగా సాగిన రథోత్సవం


బుగ్గ రామలింగేశ్వరుని కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

తాడిపత్రి అర్బన్: వేలాదిమంది భక్తులు 'ఓంనమః శివాయ' అంటూ చేసిన స్మరణతో దక్షిణ కాశీ క్షేత్రంగా ఖ్యాతిగాంచిన తాడిపత్రిలోని బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయం మార్మోగింది. భక్తుల ఓంకార నాదాల మధ్య ఆది దంపతుల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. పంచాక్షరీ విభుని కల్యాణఘట్టాన్ని, వైభోగాన్ని ప్రత్యక్షంగా తిలకించేందుకు వేల సంఖ్యలో భక్తులు తరలిరావడంతో బుగ్గరామలింగేశ్వరస్వామి సన్నిధానం జనసంద్రమైంది. శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం అమావాస్య ఘడియల్లో ఆదిదంపతుల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టు వస్త్రాలను ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు, వైఎస్సార్‌సీపీ యువ నేత కేతిరెడ్డి హర్షవర్దన్‌రెడ్డి, చింతల వేంకటరమణస్వామి ఆలయ ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు వేలూరి మురళీప్రసాదరెడ్డి సమర్పించారు. శాస్త్రోక్తంగా సాగిన కల్యాణ క్రతువును చూసి భక్తులు పులకించిపోయారు. హరహర మహాదేవ.. శంభోశంకర అంటూ పునీతులయ్యారు. వేడుక అనంతరం పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. వేడుకలో దాదాపు 10వేల మందికి పైగా భక్తులు పాల్గొన్నారు. అనంతరం సాయంత్రం బ్రహ్మ రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. రాజరాజేశ్వరీ దేవితో కలసి బుగ్గ రామలింగేశ్వరుడి ఉత్సవ మూర్తులను రథంపై అధిష్టింపజేసి మెయిన్ బజార్, పాత ఆంధ్రాబ్యాంక్ నుంచి తిరిగి రథశాల వరకూ రథాన్ని లాగారు. భక్తులకు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అల్పాహారం, మజ్జిగ, చల్లని పానీయాలు అందించారు. రథోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా తహసీల్దార్ ఆంజనేయులు, డీఎస్పీ గంగయ్య ఆధ్వర్యంలో సీఐలు మురళీకృష్ణ, లక్ష్మీకాంతరెడ్డి, రోషన్, నాగార్జునరెడ్డి పర్యవేక్షించారు.


మెయిన్‌బజార్‌లో కొనసాగుతున్న రథోత్సవం

రేషన్ బియ్యం స్వాధీనం

యల్లనూరు/గుంతకల్లు టౌన్: జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. యల్లనూరు మండలం తిరుమాలపురం క్రాస్ వద్ద వాహన తనిఖీలు చేపట్టిన సమయంలో అటుగా వచ్చిన బొలెరో, ఆటోను పుట్లూరు సీఐ సుబ్రహ్మణ్యం, సిబ్బంది అడ్డుకుని పరిశీలించారు. 13 క్వింటాళ్ల 45 కిలోల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని రెండు వాహనాలను సీజ్ చేశారు. ఇద్దరు డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. అలాగే తిమ్మంపల్లిలోని నూతన పెట్రోల్ బంకు వద్ద అక్రమంగా మద్యం అమ్ముతున్న శ్రీరాములుని అదుపులోకి తీసుకుని 12 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అలాగే వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామానికి చెందిన సి.యలమకూరు అశోక్, దిద్దికట్టి రాజు 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తూ స్థానిక రిజర్వాయర్ వద్ద పట్టుబడినట్లు గుంతకల్లు సీఐ రామసుబ్బయ్య తెలిపారు.

నెట్టికంటుడిని దర్శించుకున్న పురావస్తు శాఖ కమిషనర్


తీర్థ ప్రసాదాలను అందజేస్తున్న ఆలయ ఈఓ భద్రాజీ

గుంతకల్లు రూరల్: రాష్ట్ర పురావస్తు శాఖ కమిషనర్ జీ.వాణీమోహన్ ఆదివారం రాత్రి కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు ఆలయ ఈఓ భద్రాజీ ఆధ్వర్యంలో అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు, శేష వస్త్రాలు, జ్ఞాపికను అందజేశారు.

యువకుడి బలవన్మరణం


నరేష్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

రాప్తాడు: కుటుంబ సభ్యులు పెళ్లి చేయలేదంటూ క్షణికావేశానికి లోనై ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... రాప్తాడుకు చెందిన తలారి నరేష్(23) అనంతపురంలో డిగ్రీ చదువుతూ ఫెయిల్ అయ్యాడు. ఈ క్రమంలో ఇంటి వద్దే ఉంటూ సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. ఇటీవల తను పెళ్లి చేయాలని కుటుంబసభ్యులను తరచూ అడుగుతూ వచ్చాడు. ఇప్పుడే పెళ్లి వద్దని, బాగా చదువుకుని జీవితంలో స్థిరపడిన తర్వాత పెళ్లి చేసుకోవాలని తల్లిదండ్రులు నచ్చచెబుతూ వచ్చారు. శనివారం సాయంత్రం మరోసారి పెళ్లి విషయంగా ఇంట్లో గొడవ పడిన నరేష్... రాత్రి అయ్యవారిపల్లి రోడ్డు వద్ద ఉన్న దొడ్డిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రుల ఆవేదనకు అంతులేకుండా పోయింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పలువురి పరామర్శ..

నరేష్ మృతి చెందిన విషయం తెలియగానే గ్రామస్తులు, బంధువులు, మిత్రులు దిగ్భ్రాంతికి లోనయ్యారు. అందరితోనూ సఖ్యతగా ఉండే నరేష్ ఇక లేడనే వార్త తెలియగానే వారంతా శోకసముద్రంలో మునిగిపోయారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఆయన సోదరుడు చంద్రశేఖర రెడ్డి ఆదివారం ఉదయం అనంతపురంలోని జీజీహెచ్ మార్చురీలో ఉన్న నరేష్ మృతదేహాన్ని పరిశీలించి, నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట గొర్రెలు, మేకల సహకార సొసైటీ చైర్మన్ పసుపుల నరసింహగౌడ్, వైస్ ఎంపీపీ రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, ఎన్నికల విభాగం మండల ఇన్‌చార్జ్ చిట్రెడ్డి సత్యనారాయణరెడ్డి, నాయకులు ఎల్ఐసీ వెంకట్రాముడు, బోయ రాము, నారాయణ తదితరులు ఉన్నారు.

వారసత్వ సంపదను కాపాడుకుందాం

- రాష్ట్ర పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి రోజా


మ్యూజియంను ప్రారంభిస్తున్న మంత్రి రోజా (చిత్రంలో) ఎమ్మెల్యే అనంత, కలెక్టర్ గౌతమి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం సెంట్రల్: వారసత్వ సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్.కె.రోజా అన్నారు. అనంతపురంలోని ఆదిమూర్తి నగర్‌లో ఆదిమూర్తినగర్‌లో నూతనంగా నిర్మించిన పురావస్తు మ్యూజియం భవనాన్ని ఆదివారం ఆమె ప్రారంభించి, మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో జిల్లాలో అత్యంత సుందరంగా పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు జిల్లా పురావస్తు ప్రదర్శనశాల భవనాన్ని నిర్మించడాన్ని అభినందించారు. దాదాపు రూ.7కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ భవనంలో శిలాయుగం నాటి వస్తువులు, పూర్వ, చారిత్రక గ్యాలరీలు, రాతి, జైన శిల్పాలు, బూడిద ముద్దలు, ఇనుప పనిముట్లు, టెర్రకోట బొమ్మలు, ఇటుకలు, నాణేలు, పెయింటింగ్స్, చైనా వేర్, పింగానీ సామగ్రి, ఆయుధాలు తదితరాలు ఎన్నో ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. రాగి, పంచలోహాల విగ్రహాలు చూడముచ్చటగా ఉన్నాయన్నారు. పాఠశాల విద్యార్థులు తప్పనిసరిగా మ్యూజియంను సందర్శించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గౌతమికి సూచించారు. కలెక్టర్ గౌతమి మాట్లాడుతూ.. శ్రీకృష్ణదేవరాయల కాలం నుంచి ఎంతో చరిత్ర కలిగిన ఈ జిల్లాలో అలనాటి చరిత్ర కళ్లకు కట్టినట్లుగా తెలుసుకునేలా మ్యూజియంను ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర పురావస్తుశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ వాణీమోహన్, ఎమ్మెల్యేలు అనంతవెంకట్రామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ దాసరి వాసంతిసాహిత్య, పురావస్తుశాఖ ఏడీ రజిత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


మృతురాలు ధనలక్ష్మి

పుట్లూరు: మండలంలోని శనగలగూడూరు సమీపంలో చోటు చేసుకున్న ప్రమాదంలో యల్లనూరు గ్రామానికి చెందిన ధనలక్ష్మి(43) మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... ఆదివారం ఉదయం తన కుమారుడు గణేష్‌తో కలసి ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఆమె శనగలగూడూరు సమీపంలో స్పీడ్ బ్రేకర్ వద్ద అదుపు తప్పి కిందపడింది. ఘటనలో తలకు తీవ్ర గాయమైన ఆమెను 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. మృతురాలి అక్క భూలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు.

- అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ మూర్తిరావు ఖోకలే దారుణ హత్య

మేనల్లుడే కాల యముడు



విగతజీవిగా పడి ఉన్న మూర్తిరావు

అనంతపురం: మేనల్లుడే కాలయముడయ్యాడు. వ్యక్తిగత కక్షతో కత్తితో గొంతు కోసి దారుణంగా హతమార్చాడు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం జిల్లా పామిడికి చెందిన మూర్తిరావు ఖోకలే దశాబ్దాల క్రితమే అనంతపురంలోని జేఎన్‌టీయూఏ ప్రధాన ద్వారం ఎదురుగా స్థిర నివాసం ఏర్పరుచుకున్నారు. ఆయనకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆరేళ్లుగా అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ పనిచేశారు. ఐదారు నెలలుగా కుమార్తెకు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. ఈ క్రమంలోనే నాలుగు నెలల క్రితం అనంతలక్ష్మిలో ఉద్యోగం మానేశారు.

భార్య కళ్లెదుటే దారుణం..

జేఎన్‌టీయూ ప్రధాన ద్వారం ఎదురుగా మూర్తిరావుకు షాపింగ్ కాంప్లెక్స్‌తో పాటు సొంతిల్లు ఉంది. అన్నింటినీ అద్దెకు ఇచ్చేసి నగరంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో కుటుంబసభ్యులతో కలసి ఉంటున్నారు. ఈ క్రమంలో తన ఇంట్లో నివాసముంటున్న మణికంఠ ఇల్లు ఖాళీ చేసి ఆదివారం మూర్తిరావుకు ఫోన్ చేశాడు. వచ్చి ఇంటిని పరిశీలించుకుని తాళం తీసుకెళ్లాలని సూచించాడు. దీంతో తన భార్య శోభాతో కలసి ఆయన ఇంటి వద్దకు చేరుకున్నారు. ఇంటిని పరిశీలిస్తూ శోభ లోపలకు వెళ్లారు. అదే సమయంలో అక్కడే పొంచి ఉన్న మేనల్లుడు ఆదిత్య లోపలకు చొరబడి కత్తితో మూర్తిరావు (58) గొంతులోకి పొడిచాడు. రెప్పపాటులోనే పలు మార్లు పొడిచి, అనంతరం అదే కత్తితో గొంతుకోశాడు. కళ్ల ముందే జరుగుతున్న దారుణం చూసి, భయపడిన శోభ గట్టిగా కేకలు వేస్తూ బయటకు పరుగుతీసింది. ఇంతలో 'అత్తా... నేనేక్కడికీ పారిపోను.. ఇక్కడే ఉంటా' అంటూ ఆదిత్య అక్కడే ఉండిపోయాడు.

హతుడి పక్కనే కూర్చొని..

మూర్తిరావును హతమార్చిన అనంతరం నేరుగా ఇంటి వెనుక ఉన్న బాత్రూమ్‌కు ఆదిత్య వెళ్లి చేతికి అంటిన రక్తాన్ని శుభ్రం చేసుకుని, నేరుగా మూర్తిరావు మృతదేహం వద్దకు చేరుకుని పక్కనే కూర్చొని ఉండిపోయాడు. ఇంతలోనే అక్కడకు చేరుకున్న పోలీసులు వచ్చి ఆదిత్యను అదుపులోకి తీసుకున్నారు. కాగా, నాలుగు రోజుల క్రితం మూర్తిరావు ఇంటికి ఎదురుగానే బ్యాచ్‌లర్‌లా పరిచయం చేసుకున్న ఆదిత్య ఓ గదిని అద్దెకు తీసుకుని అందులోకి మకాం మార్చినట్లు తెలుస్తోంది. పథకం ప్రకారమే మూర్తిరావును హత్య చేయాలని కుట్ర పన్నినట్లుగా సమాచారం. తమ కుటుంబాన్ని ఎదగనీయకుండా మామ చూస్తున్నారని, తనకు పెళ్లి సంబంధాలు రాకుండా అడ్డుకుంటున్నారనే అనుమానంతో హత్య చేసినట్లు పోలీసుల ఎదుట నిందితుడు అంగీకరించినట్లు తెలుస్తోంది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. నిందితుడిని సోమవారం మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచనున్నట్లు పేర్కొన్నారు.

వివాదరహితుడు

జేఎన్‌టీయూఏలో సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో బీటెక్, ఎంటెక్ పూర్తి చేసి పీహెచ్‌డీ పొందిన మూర్తిరావు పలు ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. వివాదరహితుడు, సౌమ్యుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. సివిల్ ఇంజినీరింగ్‌లో నిష్ణాతుడు. మంచి పరిశోధకుడు. అందరినీ ఆప్యాయంగా పలకరించే మూర్తిరావు హత్యకు గురైన విషయం తెలియగానే నగరం ఉలిక్కిపడింది. ఆయనను కడసారి చూసేందుకు జేఎన్‌టీయూఏ ప్రొఫెసర్లు, అనంతలక్ష్మి కళాశాల విద్యార్థులు బారులు తీరారు. కాగా, మూర్తిరావు భార్య శోభ... శ్రీసత్యసాయి జిల్లా తాడిమర్రి మండలం పినదర్రి గ్రామ జెడ్పీహెచ్ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. కొడుకు ఉజ్వల్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా, కుమార్తె వైష్ణవి బెంగళూర్‌లో బ్యాంక్ ఉద్యోగిగా స్థిరపడ్డారు.

కూటమిని ఓడించండి

- సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్


మాట్లాడుతున్న జాఫర్

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిని ఓడించాలని ప్రజలకు సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి మోసం చేసిన ప్రధాని నరేంద్ర మోదీకి ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. రాష్ట్రంలో రాజకీయాలు తిరోగమనంలో ఉన్నాయన్నారు. కులాలు, మతాల పేరుతో ప్రజలను బీజేపీ విభజించి పాలిస్తోందని మండిపడ్డారు. అధికారంలో ఉన్న ఈ పదేళ్లలో రాష్ట్రానికి మోదీ ప్రభుత్వం చేసిన మంచి ఏదీ లేదన్నారు. విభజన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. పదేళ్లవుతున్నా జిల్లాలో బెల్ కంపెనీ, కేంద్రీయ విశ్వవిద్యాలయం పూర్తి కాలేదన్నారు. అలాంటి పార్టీకి టీడీపీ, జనసేన కొమ్ముకాస్తుండడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బీజేపీతో పొత్తు పెట్టుకున్న టీడీపీ, జనసేన పార్టీని చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు.

వడదెబ్బతో కూలీ మృతి


ఓబులేసు (ఫైల్)

పామిడి: స్థానిక పామిడమ్మ వీధికి చెందిన వ్యవసాయ కూలీ బోయ ఓబులేసు (54) వడదెబ్బతో మృతి చెందాడు. పాగరూరు గ్రామానికి చెందిన ఆయన కొన్నేళ్ల క్రితం పామిడికి వచ్చి స్థిరపడ్డాడు. వ్యవసాయ కూలి పనులతో జీవనం సాగిస్తున్నాడు. భార్య గోవిందమ్మ, ఓ కుమారుడు ఉన్నారు. ఆదివారం వ్యవసాయ కూలి పనులకు వెళ్లిన ఆయన సాయంత్రం ఇంటికి వెనుదిరిగి వెళుతూ పామిడి స్టేషన్ వద్దకు చేరుకోగానే కుప్పకూలాడు. అపస్మారక స్థితికి చేరుకున్న ఓబులేసును స్థానికులు వెంటనే పామిడి సీహెచ్‌సీకి తరలించారు. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందాడు.

అంకితభావంతో పని చేయండి : డీఎంహెచ్ఓ



ఉత్తర్వులు అందజేస్తున్న డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి

అనంతపురం మెడికల్: అంకితభావంతో పని చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఎంపీహెచ్ఏ(ఎం)లకు డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి పిలుపునిచ్చారు. ఇటీవల క్రమబద్ధీకరణ పొందిన 120 మంది ఎంపీహెచ్ఏ(ఎం)లకు ఆదివారం తన కార్యాలయంలో ఉత్తర్వులను ఆమె అందజేసి, మాట్లాడారు. ఏళ్ల తరబడి రెగ్యులరైజేషన్ కోసం ఎదురు చూసిన ఉద్యోగులకు ప్రభుత్వం గొప్ప అవకాశం కల్పించిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ వైద్య కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. గ్రామీణ ప్రాంతా ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. కాగా, 20 ఏళ్లుగా రెగ్యులరైజేషన్ కోసం ఎదురు చూసిన కాంట్రాక్ట్ ఉద్యోగులు క్రమబద్ధీకరణ ఉత్తర్వులను అందుకోవడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారంటూ ఆదివారం డీఎంహెచ్ఓ కార్యాలయంలోఆనందాన్ని వ్యక్తం చేశారు.

వజ్రాల పరిశోధన కేంద్రంలో స్ట్రాటిగ్రాఫిక్ కాలమ్ ఆవిష్కరణ


స్ట్రాటిగ్రాఫిక్ కాలమ్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

వజ్రకరూరు: స్థానిక వజ్రాల ప్రక్రమణ కేంద్రం (జీఎస్ఐ)లో ఆదివారం స్ట్రాటిగ్రాఫిక్ కాలమ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి దక్షిణ ప్రాంత జీఎస్ఐ ఏడీజీహెచ్ఓడీసీహెచ్ వెంకటేశ్వరరావు, ఏపీ ఎస్‌యూ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎస్ఎన్ సత్యనారాయణ మహాపాత్రో తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరై, మాట్లాడారు. భారతదేశంలో రెండవ అతిపెద్ద ప్రొటీరోజోయిక్ బేసిన్‌గా ఖ్యాతిగాంచిన కడప బేసిన్ భౌగోళిక చరిత్రకు స్ట్రాటిగ్రాఫిక్ కాలమ్ ఓ అద్భుత సాక్ష్యంగా నిలుస్తుందన్నారు. కీలకమైన విద్యా, పరిశోధన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఈ స్ట్రాటిగ్రాఫిక్ కాలమ్ దోహదపడుతుందన్నారు. కింబర్‌లైట్, ల్యాం ప్రోయిట్ల ప్రదర్శనతో పాటు కడప బేసిన్ ప్రాముఖ్యతను ఈ కాలమ్ తెలుపుతుందన్నారు. భారతదేశంలో హైదరాబాద్ తర్వాత రెండవ స్ట్రాటిగ్రాఫిక్ కాలమ్‌ను వజ్రకరూరులో ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఏపీ భూగర్భశాస్త్రంలో కడప సూపర్ గ్రూపు ప్రాముఖ్యత, భౌగోళిక శాస్త్రీయ అవగాహన, అన్వేషణను ప్రోత్సహించడంలో జీఎస్ఐ నిబద్ధతను వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు డాక్టర్ అపూర్వబెనర్జీ, రాకేష్ కుమార్ గుప్తా, తరుణ్‌కోలే, వజ్రకరూరు జీఎస్ఐ క్యాంప్ ఇన్‌చార్జ్ హరికృష్ణ, జియాలజిస్టులు సుమనమండల్, శ్రీపాతబాల్, కేవీజెడ్పీ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు 39వ డివిజన్‌లో 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 39వ డివిజన్‌లోని లక్ష్మీనగర్‌లో సోమవారం ఉదయం 7 గంటలకు ఇంటింటికీ వైఎస్సార్ సీపీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. లక్ష్మీనగర్‌లోని నాగులకట్ట నుంచి కార్యక్రమం మొదలవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

ఈడిగలు అన్ని రంగాల్లో రాణించాలి



మెడిసిన్ విద్యార్థి మంజునాథ్ గౌడ్‌కు నగదు అందజేస్తున్న కిరణ్ కుమార్‌గౌడ్

అనంతపురం ఎడ్యుకేషన్: ఈడిగ (గౌడ) కులస్తులు అన్ని రంగాల్లోనూ రాణించాలని ఈడిగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు, కిరణ్ గౌడ్ ట్రస్టు అధినేత బొమ్మగాని కిరణ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం కిరణ్ గౌడ్ ట్రస్టు ద్వారా కడప రిమ్స్‌లో మెడిసిన్ మూడో సంవత్సరం చదువుతున్న యాడికి మండలానికి చెందిన మంజునాథ్ గౌడ్ అనే విద్యార్థికి రూ.60 వేల ఆర్థికసాయం అందజేశారు. మెడిసిన్ పూర్తయ్యే వరకు ఖర్చును పూర్తిగా కిరణ్ గౌడ్ ట్రస్ట్ భరిస్తుందని హామీ ఇచ్చారు. మరో విద్యార్థి మోహన్‌కృష్ణ దివ్యాంగుల ఈత పోటీల్లో జాతీయ స్థాయికి ఎంపిక కావడంతో రవాణా ఖర్చుల కోసం కిరణ్ కుమార్ గౌడ్ రూ.10 వేలు, ఈడిగ సంఘం తరఫున రూ.5 వేల సాయం చేశారు. కిరణ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. 139 మంది గీత కార్మికులకు ఇన్సూరెన్స్ చేయడం ద్వారా కరోనా సమయంలో మృతి చెందిన వారికి ఇన్సూరెన్స్ వర్తించిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా ఈడిగ సంక్షేమ సంఘం నాయకులు శ్రీనివాస్ గౌడ్, జిల్లా కోశాధికారి వెంకటేశ్వర్లు, మారుతి గౌడ్, టీచర్ నాగభూషణం, జయచంద్ర గౌడ్, రాము గౌడ్, శివ, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

సంతల ఆదాయం రూ.2.99 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈ వారం పరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రూ.2.99 లక్షలు ఆదాయం వచ్చినట్లు యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, సెలెక్షన్ గ్రేడ్ సెక్రెటరీ ఆర్.జయలక్ష్మి తెలిపారు. అందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత నుంచి రూ.1,55,050 వసూలు కాగా.. ఆదివారం జరిగిన పశువులు, ఎద్దుల సంత ద్వారా రూ.1,44,070 మేర వసూలైనట్లు పేర్కొన్నారు.

అశ్వ వాహనంపై విహరించిన శివయ్య



అనంతపురం కల్చరల్: పది రోజులుగా సాగుతున్న మహాశివ రాత్రి బ్రహ్మోత్సవ వేడుకలు ముగింపు దశకు చేరుకున్నాయి. ఆదివారం మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో అశ్వ వాహనంపై పార్వతీ పరమేశ్వరులు దర్శనమిచ్చారు. మహాశివుడికి మహాన్యాస పూర్వక వార రుద్రాభిషేకాలు, అలంకార సేవలు జరిగాయి. దీక్ష హోమం, దసహారతులతో అమ్మవారికి భక్తిసీరాజనాలు అర్పించారు. ఆలయంలో సాగిన సాంస్కృతిక సంబరాలు అలరించాయి. ఆలయ ఈఓ రమేష్ బాబు మాట్లాడుతూ.. సోమవారం సైనా ఉత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నారు.

మైనార్టీలపై దాడులు అరికట్టాలి



రంజాన్ వేళల క్యాలెండర్ విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం అర్బన్: సీఏఏ, ఎన్ఆర్‌సీ, ఎన్‌పీఆర్ రద్దు చేయాలని ఆవాజ్ కమిటీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వలి, ముస్కిన్ డిమాండ్ చేశారు. డిమాండ్లతో కూడిన రంజాన్ వేళల క్యాలెండర్‌ను ఆదివారం స్థానిక పాతూరులోని జామియా మజీద్ వద్ద నాయకులు విడుదల చేశారు. ముందుగా ముస్లిం సోదరులకు రంజాన్ ఒక్క పొద్దుల సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. జస్టిస్ రంగనాథ్ మిశ్రా కమిషన్ సిఫారసుల మేరకు 10 శాతం రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. జనాభా ప్రాతిపదికన బడ్జెట్ కేటాయించాలని కోరారు. వక్ఫ్‌బోర్డు ఆస్తులను పరిరక్షించాలన్నారు. మైనారిటీలు, దళితులపై జరుగుతున్న దాడులు అరికట్టాలన్నారు. దుల్హాన్ పథకం కింద రూ.లక్ష కానుక, మైనారిటీ విద్యార్థులకు ఉపకారవేతనం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో ఆవాజ్ నాయకులు ఇస్మాయిల్, రహంతుల్లా, మైనారిటీ ప్రజాసంఘాల నాయకులు దాదాగాంధీ, భాషా, బాబా ఫక్రుద్దీన్, మసూద్, నూరు పాల్గొన్నారు.

చిరు జీవితాలకు కొండంత చేయూత

- వరుసగా నాలుగో ఏటా మహిళలకు ఆర్థికసాయం
- మహిళా సాధికారతకు జగనన్న సర్కార్ పెద్దపీట
- సంతోషం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



ఆత్మకూరు: సీఎం జగన్ మహిళా సంక్షేమానికి కృషి చేస్తున్నారు. అధికారం చేపట్టినప్పటి నుంచి అక్కచెల్లెమ్మల పేరు మీద వివిధ సంక్షేమ పథకాలు తీసుకొచ్చారు. గతంలో ఏ ప్రభుత్వాలు చేయని విధంగా నవరత్నాల్లోని పథకాలు అమలు చేస్తున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మహిళల జీవనోపాధికి వైఎస్సార్ చేయూత పథకానికి శ్రీకారం చుట్టారు. లక్షలాది మంది మహిళలకు ఆర్థికంగా భరోసా అందిస్తూ వ్యాపారాలు, చేతివృత్తులు, చిన్నపాటి పరిశ్రమలు వైపు ఆసక్తి చూపేలా ముందుండి నడిపిస్తున్నారు. ఆత్మకూరు మండల వ్యాప్తంగా వైఎస్సార్ చేయూత కింద 2,034 మంది మహిళలకు రూ.13,89,68,750 నగదు మంజూరైనట్లు అధికారులు చెబుతున్నారు. అదే విధంగా ఆత్మకూరు మండలంలోని 679 మహిళా సంఘాల్లోని 6,546 మంది సభ్యులకు వైఎస్సార్ ఆసరా పథకం కింద రూ.17.94 కోట్ల నగదు ఖాతాల్లో జమ అయ్యాయి. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ముఖ్యమంత్రి జగనన్న మహిళలకు ఆర్థికంగా అండగా నిలిచారు. అదేవిధంగా ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అమ్మ డెయిరీ ద్వారా మహిళలు, పాడి రైతులకు ఉపాధి కల్పించారు. త్వరలోనే గార్మెంట్ పరిశ్రమ ద్వారా కూడా మహిళలకు ఉపాధి కల్పిస్తున్నట్లు ఆయన పలు సమావేశాల్లో తెలియజేశారు.

ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు పెద్దక్క, ఆత్మకూరు గ్రామం. ఈమెకు నాలుగు సంవత్సరాలుగా వైఎస్సార్ చేయూత అందుతోంది. ఏటా రూ.18,750 నగదు బ్యాంకు ఖాతాలో జమ అయింది. మొదటి సంవత్సరం నగదు రూ.18,750తో పాటు రూ.10 వేలు వేసుకుని రెండు మేకలు కొనుగోలు చేసింది. మేకలు ఏడాది పాటు పెంచగా రెండు కాస్త ఆరు మేకలు అయ్యాయి. వీటిని విక్రయించగా.. రూ.70 వేలు వచ్చాయి. మరుసటి యేడాది చేయూత నగదుతో మళ్లీ మేకలనే కొనుగోలు చేసింది. మళ్లీ యేడాది మేకలను పెంచి విక్రయించగా రూ.75 వేలు వచ్చాయి. ప్రస్తుతం ఈమె దగ్గర 10 మేకలకు పైగా ఉన్నాయి. చేయూత నగదుతోనే ఇలా మేకల పెంపకంతో జీవనం సాగిస్తోంది. మాలాంటి ఎంతో మంది మహిళలకు జగనన్న అండగా ఉన్నారని ఆనందం వ్యక్తం చేసింది.



2024 వరకూ నియోజకవర్గ వ్యాప్తంగా వైఎస్సార్ చేయూత లబ్ధి ఇలా..

మహిళల సంఖ్య	మంజూరైన నగదు
15,588	రూ.67,60,00,000



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు సరస్వతి ఈమెది ఆత్మకూరు మండలం వడ్డుపల్లి గ్రామం. ఈమె ఒంటరి మహిళ ఏటా ప్రభుత్వం నుంచి వచ్చిన వైఎస్సార్ చేయూత రూ.18,750 నగదుతో పాటు ఈమె ఎస్సీ సబ్లాన్ కింద రూ.50 వేలు, అంతేకాకుండా బ్యాంక్ రుణం రూ.30 వేలు తీసుకుని సరుకుల అంగడి నడుపుతోంది. జగనన్న ఇచ్చిన అండతోనే జీవనం సాఫీగా సాగుతోందని చెబుతోంది.



ఈ ఫొటోలో కనిపించే మహిళ పేరు భాగ్యలక్ష్మి. ఈమెది ఆత్మకూరు మండలం వడ్డుపల్లి గ్రామం. వైఎస్సార్ చేయూత కింద రూ.18,750 ఆర్థికసాయం పొందుతోంది. ప్రభుత్వం ఇచ్చిన నగదుతో చిన్న చిన్నగా వ్యాపారం మొదలుపెట్టింది. ప్రస్తుతం ఓ అంగడి పెట్టుకుని భర్త, కుటుంబంతో జీవనం సాగిస్తోంది. అంగడి ద్వారా కుటుంబ అవసరాలు తీరుతున్నాయని భాగ్యలక్ష్మి తెలిపింది. హామీ మేరకు పథకాలన్నీ అందజేసిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందని పేర్కొంది.

మళ్లీ జగనన్నే సీఎం..



గతంలో ఏ సీఎం చేయని విధంగా జగనన్న మహిళల సంక్షేమానికి పాటుపడుతున్నారు. మహిళల ఆర్థిక ఎదుగుదలకు అనేక పథకాలు తీసుకువచ్చి అండగా నిలిచారు. అంతేకాకుండా రాజకీయాల్లో కూడా 50 శాతం రిజర్వేషన్ కల్పించి మహిళలకు రాజకీయ గుర్తింపు తీసుకొచ్చారు. మహిళలకు తోబుట్టువులా జగనన్న అండగా నిలుస్తున్నారు. జగనన్నకు మహిళల అండ ఎప్పుడూ ఉంటుంది. మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకుంటాం.
– హేమలత, ఎంపీపీ, ఆత్మకూరు

అక్కచెల్లెమ్మలకు అండ



సీఎం జగనన్న పేరు చెబితే అక్కచెల్లెమ్మలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ ఆసరా, చేయూత, విద్యా దీవెన, అమ్మ ఒడి, సున్నా వడ్డీ రుణాలు ఇలా అనేక పథకాలు ఇచ్చి మహిళల ఆర్థికాభివృద్ధికి అండగా నిలిచారు. ఎంతో మంది తమ సొంత కాళ్లపై నిలబడి జీవనం సాగించేలా మహిళల్లో ధైర్యాన్ని నింపారు. అంతేకాకుండా అమ్మ డెయిరీ ద్వారా నియోజకవర్గంలో వేలమంది మహిళలకు ఉపాధి కల్పించాం. గార్మెంట్ పరిశ్రమకు భూ సేకరణ చేశాం.
– తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఎమ్మెల్యే, రాప్తాడు

బాబుకు రాజకీయ సమాధి తథ్యం

- వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీదే విజయం
- సంక్షేమం, అభివృద్ధి కొనసాగిస్తాం
- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి
- 46వ డివిజన్‌లో కొనసాగిన 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'



సంక్షేమ పథకాల కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: సిద్ధాంత పరంగా విభేదించే రాజకీయ పార్టీలతో చంద్రబాబు కలిశారు. ముక్క లేనిదే ముద్ద దిగదు అన్నట్లు చంద్రబాబుకు పొత్తు లేనిదే రాజకీయం చేయలేరు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబుకు రాజకీయ సమాధి కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆదివారం 46వ డివిజన్‌లో ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలకు చేసిన మేలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను ఎమ్మెల్యే ప్రజలకు అందించారు. మరోమారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత టీడీపీ ప్రభుత్వం నగరంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఊహకందని విధంగా అభివృద్ధి చేశామన్నారు. ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రోడ్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేయడం ద్వారా పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం ఉచితంగా అందుతోందని పేర్కొన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎంగా ఉంటేనే సంక్షేమం, అభివృద్ధి కొనసాగుతుందన్నారు. 2019 ఎన్నికలకు ముందు ఒక్క అవకాశం ఇస్తే..సంక్షేమం, అభివృద్ధి చేసి చూపుతామని చెప్పామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం అనంతపురం నియోజకవర్గంలో రూ.2 వేల కోట్లకు పైగా సంక్షేమం, రూ.వెయ్యి కోట్లకు పైగా అభివృద్ధి జరిగేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుందని వెల్లడించారు.

ప్రధానిని విమర్శించలేదా?

ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు జీవితమంతా పొత్తులు, అతుకులు, బొంతలు తప్పితే ఏదీ లేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రం విడిపోయాక స్పెషల్ స్టేటస్, పోలవరం పూర్తి చేస్తానని బీజేపీ, జనసేన నేతలతో కలసి తిరుపతి వేదికగా మాట్లాడిన విషయాన్ని గుర్తు చేశారు. 2018లో ప్రధాని మోదీపై విమర్శలు చేశారని తెలిపారు. గత ఎన్నికల సమయంలో చంద్రబాబు పోలవరంను ఏటీఎంగా వాడుకున్నారని ప్రధాని మోదీ విమర్శించ లేదా అని ప్రశ్నించారు. ఇప్పుడు అధికారం కోసం ఒకే ఒక లక్ష్యంతో బీజేపీతో పొత్తు పెట్టుకున్నారని మండిపడ్డారు. ఆది నుంచి బీజేపీ సిద్ధాంతాలకు తాము వ్యతిరేకమని.. మతతత్వ పార్టీలకు వ్యతిరేకం అని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్పష్టం చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్ యార్డు చైర్మన్ ఫయాజ్, వైస్ చైర్మన్ ఓబిరెడ్డి, కార్పొరేటర్లు రాజేశ్వరి, కమల్ భూషణ్, ఇసాక్, అనిల్‌కుమార్ రెడ్డి, సాకే చంద్రలేఖ, బాలాంజినేయులు, జయలలిత, జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి, పార్టీ సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జ్ రిలాక్స్ నాగరాజు, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఉమ్మడి మదన్ మోహన్ రెడ్డి, కొర్రపాడు హుస్సేన్ పీరా, శ్రీదేవి, జేసీఎస్ కన్వీనర్ చింతా సోమశేఖర్ రెడ్డి, పార్టీ నగరాధ్యక్షురాలు కృష్ణవేణి, నాయకులు దాదాఖలందర్, రామయ్య, ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, అమర్‌నాథ్ రెడ్డి, జానీ, జావెద్, గుజ్జల లక్ష్మణ్, కేశవరెడ్డి, అనిత, శోభాబాయి, పార్వతి,దేవి, సుహాసిని, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల కథలు అద్భుతం



రాయలసీమ ఉపాధ్యాయ కథలు పుస్తకావిష్కరణ చేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: రాయలసీమ ఉపాధ్యాయ కథలు చదివితే పాఠశాలల పరిస్థితి, దాని చుట్టూ అల్లుకున్న పరిస్థితులు అర్థమవుతాయని పలువురు కవులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎన్‌జీఓ హోంలో ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ ఎం.హరికిషన్ రచించిన రాయలసీమ ఉపాధ్యాయ కథలు పుస్తకావిష్కరణ జరిగింది. రచయిత ఈశ్వర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాయలసీమ సామాజిక, ఆర్థిక రాజకీయ, వర్తమాన, చారిత్రక పరిస్థితులకు ఈ కథలు అద్దం పడతాయన్నారు. ప్రముఖ కవి బండి నారాయణ స్వామి మాట్లాడుతూ.. ప్రతి కథ పాఠశాల పరిస్థితులను కళ్లకు కట్టినట్లు చూపిస్తుందన్నారు. కార్యక్రమంలో కవులు డాక్టర్ శాంతినారాయణ, డాక్టర్ కే.నాగేశ్వరచారి, హాస్యకథ నవల రచయిత్రి జయలక్ష్మిరాజు, అరసం కర్నూలు మాజీ జిల్లా అధ్యక్షులు జయరాం, అభ్యుదయ రచయితల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నానీల నాగేంద్ర, డాక్టర్ తన్నీరు నాగేంద్ర, డాక్టర్ అనితమ్మ, రాజారాం, గంగిరెడ్డి, అశ్వర్థరెడ్డి, తరిమెల అమర్నాథ్‌రెడ్డి, ఏలూరు యంగన్న, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, దాసరి ఆదినారాయణ, కొత్తపల్లి సురేష్, మధుర శ్రీ, వన్నప్ప, డాక్టర్ జూటూరు షరీఫ్, వెంకటరమణ, పెద్దన్న, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

గోల్డెన్ అవర్‌లో ప్రథమ చికిత్స అందించాలి

అనంతపురం మెడికల్: ఇండియన్ రెడ్‌క్రాస్, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ, ప్రగతిపథం యూత్ ఆధ్వర్యంలో నగరంలోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో ఆదివారం ప్రథమ చికిత్సపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. హార్ట్ ఫెయిల్యూర్ అయినప్పుడు, ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులు, బాధితులను ఏ విధంగా కాపాడాలనే విషయంపై ట్రైనర్ డాక్టర్ కృష్ణవేణి తదితరులు ప్రత్యక్షంగా వివరించారు. గోల్డెన్ అవర్‌లో రోగికి ప్రథమ చికిత్సనందించి ఆస్పత్రికి తరలిస్తే ప్రాణం పోసిన వారు అవుతామన్నారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి మోహన్‌కృష్ణ, రాష్ట్రపతి అవార్డు గ్రహీత బిసాటి భరత్, మానసిక వైద్య నిపుణులు డాక్టర్ గురుగు బాలాజీ, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ సుంకర రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్బరత్నమ్మ సేవలు ప్రశంసనీయం



సుబ్బరత్నమ్మను సత్కరిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమ

అనంతపురం: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఉప గ్రంథాలయాధికారిగా విధులు నిర్వహిస్తున్న వి.సుబ్బరత్నమ్మకు గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శిగా పదోన్నతి లభించింది. ఆదివారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆత్మీయ సత్కార సభ నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ ఎల్ఎం ఉమ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంకితభావంతో సుబ్బరత్నమ్మ విధులు నిర్వర్తించారన్నారు. గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శిగా పదోన్నతి లభించడం సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎల్ఎం మోహన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ, ఉద్యోగ సంఘం నాయకులు వై.ప్రతాప్ రెడ్డి, బి.రవికుమార్ నాయుడు, హెచ్.రామాంజనేయులు, గోవిందు, శ్రీనివాసులు, కమ్మన్న, జయరాము, ఇంతియాజ్, విజయభాస్కర్, కృష్ణయ్య, వీరనారాయణ రెడ్డి, వేణుగోపాల్ నాయుడు, రామాంజినమ్మ, కావేరి, జీఎం భాష, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వాహ్‌నర విన్యాసం



క్యాన్ ట్యాప్ తిప్పుతున్న కోతి



గ్లాసును బయటకు తీసేందుకు ప్రయత్నిస్తున్న దృశ్యం



చివరకు ట్యాప్ తిప్పి నీళ్లు తాగుతున్న కోతి

ఆత్మకూరు: బయట ఎండలు మండిపోతున్నాయి. ఉదయం పది గంటలు దాటితే బయట కాలు పెట్టేందుకు జనం భయపడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆదివారం ఆత్మకూరులోని లైబ్రరీలోకి ఓ వానరం చొరబడింది. దానిని చూడగానే పాఠకుల దృష్టి మొత్తం అటుగా మళ్లింది. దప్పికతో ఉందేమో.. తాగునీటి కోసం వెతుకుతూ నేరుగా వాటర్‌క్యాన్ వద్దకు చేరుకుంది. ఇంకేముంది... అసలే వానరం.. ఏమైనా అంటే మీదపడి రక్కేస్తోందేమోనని అందరూ భయపడ్డారు. అదే సమయంలో క్యాన్‌కు అమర్చిన ట్యాప్ తిప్పడానికి నానా అగచాట్లు పడింది. సాధ్యం కాకపోవడంతో క్యాన్ మూతపై ఉన్న గ్లాసును తీసేందుకు ప్రయత్నించింది. గ్లాస్ కూడా రాకపోవడంతో దానినీ వదిలేసి ట్యాప్‌తో యుద్ధం చేసి ఎట్టకేలకు విజయం సాధించింది. తన దాహాన్ని తీర్చుకుని నెమ్మదిగా వచ్చిన దారినే వెనుతిరిగి వెళ్లింది.

రాజకీయ ప్రాధాన్యత ఇవ్వాలి

అనంతపురం టవర్‌క్లాక్: ముస్లిం, మైనార్టీలకు రాజకీయ ప్రాధాన్యత ఇవ్వాలని జామియత్-ఏ-ఉలమా-ఇ-హింద్ హమీద్ ఉసేన్ కోరారు. ఆదివారం స్థానిక ఓ ఫంక్షన్ హాల్‌లో పేష్ ఇమామ్‌లు, ముతవల్లీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనంతపురం జిల్లాలో 3 లక్షలకు పైగా ముస్లిం ఓటర్లు ఉన్నారన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో రెండు ఎమ్మెల్యే, ఒక ఎంపీ స్థానం ముస్లింలకు ఇవ్వాలని కోరారు. ఉలమాస్‌లు నిజామ్‌వుద్దీన్, అబ్దుల్ రజాక్, రసూల్ పాల్గొన్నారు.

గొరిదిండ్ల వద్ద విద్యుత్ సబ్‌స్టేషన్

ఆత్మకూరు: మండలంలోని గొరిదిండ్ల సమీపంలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీపీ హేమలత తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం విద్యుత్‌శాఖ డీఈ మహేష్‌కుమార్, ఏఈ దాస్, గ్రామస్తులతో కలిసి విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నరసింహులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పోతన్న, రామునాయక్, అంజినప్ప, రమేష్, గొవింద్, మహేష్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం



రంగంపేటలో బోరు వేయడంతో నీరు సమృద్ధిగా పడిన దృశ్యం

ఆత్మకూరు: మండలంలోని రంగంపేటలో తాగునీటి సమస్య పరిష్కారమైంది. కొద్ది రోజులుగా నీటి సమస్య ఉండటంతో ఈ విషయాన్ని గ్రామస్తులు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆదివారం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆదేశాలతో సర్పంచ్ ఉజ్జినప్ప పంచాయతీ నిధులతో గ్రామంలో బోరు వేయించారు. బోరులో నీరు అనుకున్న దాని కన్నా సమృద్ధిగా పడటంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఇక గ్రామంలో తాగునీటి సమస్య ఉండదని తెలిపారు.

లక్ష్యానికి చేరువగా మార్కెటింగ్ శాఖ

అనంతపురం అగ్రికల్చర్: మార్కెటింగ్‌శాఖ లక్ష్యం దిశగా పయనిస్తోంది. ఫిబ్రవరి నెలాఖరుకు 90 శాతం లక్ష్యం సాధించడంతో ఈ నెలాఖరులోపు వంద శాతం పూర్తయ్యే అవకాశం ఉందని ఏడీ మార్కెటింగ్ పి.సత్యనారాయణచౌదరి ఆశాభావం వ్యక్తం చేశారు. గుత్తి, గుంతకల్లు మార్కెట్‌యార్డులు మినహా మిగిలిన ఏడు మార్కెట్ కమిటీల్లో ఫీజు వసూళ్ల పరిస్థితి మెరుగ్గా ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో ఉన్న తొమ్మిది మార్కెట్ యార్డులు, 15 చెక్‌పోస్టుల ద్వారా ఈ ఏడాది రూ.10.81 కోట్లు పన్నులు వసూళ్లు చేయాలని లక్ష్య నిర్దేశన చేయగా ఫిబ్రవరి నెలాఖరుకు 90 శాతంతో రూ.9.67 కోట్లకు పైగా వసూళ్లు జరిగినట్లు వివరించారు. కాగా, శింగనమల మార్కెట్ కమిటీ లక్ష్యం రూ.75 లక్షలకు గానూ 118 శాతంతో 88.44 లక్షల వసూళ్ల ప్రగతి సాధించింది. రెండో స్థానంలో అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డు రూ.4.10 కోట్లకు గానూ 95 శాతంతో రూ.3.89 కోట్లు, అలాగే తాడిపత్రి రూ.1.85 కోట్లకు గానూ 95 శాతంతో రూ.1.76 కోట్ల వసూళ్లతో లక్ష్యానికి చేరువయ్యాయి. తర్వాత రాయదుర్గం 88 శాతం, కళ్యాణదుర్గం, రాప్తాడు మార్కెట్‌యార్డులు 83 శాతం, ఉరవకొండ 82 శాతంతో లక్ష్యం దిశగా పయనిస్తున్నాయి.

కిడ్నీ బాధితురాలికి 'అమ్మ' చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న అమ్మ సంస్థ నిర్వాహకుడు తరిమెల రమణా రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: రెండు కిడ్నీలు చెడిపోయి ఇబ్బంది పడుతున్న ఓ మహిళకు అమ్మ స్వచ్ఛంద సంస్థ చేయూత అందించింది. వివరాల్లోకి వెళ్తే.. నగరంలోని పాతూరుకు చెందిన అలివేలమ్మ అనే మహిళ ఇంటి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. కొన్ని నెలల క్రితం కడుపు నొప్పి రావడంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చూపించుకుంది. అక్కడి వైద్యులు పరీక్షించి, కిడ్నీలు చెడిపోయాయని తెలిపారు. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేసుకుంటే బతుకుతావని చెప్పారు. అలివేలమ్మకు ఆమె మేనత్త రామలక్ష్మమ్మ కిడ్నీ ఇచ్చేందుకు ముందుకొచ్చారు. అనంతరం అలివేలమ్మ బంధువులు బెంగళూరులోని ప్రముఖ ఆస్పత్రిలో చూపించడంతో ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు రూ.8 లక్షలు ఖర్చు అవుతుందని తెలిపారు. విషయం తెలుసుకున్న అమ్మ సంస్థ వ్యవస్థాపకుడు తరిమెల రమణారెడ్డి కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు రూ.2 లక్షల నగదు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అనంతపురం: నగరంలోని వైభవ్ రెసిడెన్స్ వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పిన ఘటనలో కురుబ గొల్ల పల్లయ్య (40) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. కక్కలపల్లికి చెందిన కురుబ గొల్ల పల్లయ్య (40), తలారి వీరాంజినేయులు (29), వడ్డే గోపాల్ (28) ద్విచక్ర వాహనంలో రుద్రంపేట వైపు బయలుదేరారు. వైభవ్ రెసిడెన్స్ వద్ద ద్విచక్ర వాహనం డివైడర్‌ను ఢీకొనడంతో అదుపు తప్పి కింద పడిపోయారు. ఈ ఘటనలో కురుబ గొల్ల పల్లయ్య (40) అక్కడికక్కడే మృతి చెందారు. ఇతనికి భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు. తలారి వీరాంజినేయులు, వడ్డే గోపాల్ గాయపడ్డారు. వీరాంజనేయులుకు తీవ్ర గాయాలు కావడంతో సవేరా ఆసుపత్రికి తరలించారు. వడ్డే గోపాల్ పరిస్థితి ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉన్నట్లు ట్రాఫిక్ సీఐ నారాయణ రెడ్డి తెలిపారు. కాగా గోపీ నాయక్ హత్య కేసులో నిందితుడు అయిన తలారి వీరాంజనేయులు ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది.